

20వ తేదీలోగా రెవెన్యూ సదస్సు నిర్వహించాలి

పెద్దపల్లి మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో ఒక మండలాన్ని పైలట్‌గా తీసుకొని ఈనెల 20వ తేదీలోగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, తదితర శాఖల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని, వాటిని జూన్ 3 నుంచి పరిష్కరించాలన్నారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదయ్యేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ భూములలో పొజిషన్‌లో ఉన్న రైతుల దరఖాస్తులు పరిశీలించాలని, భూమి లేని నిరుపేదలు పొజిషన్‌లో ఉంటే వారికి పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. పట్టాలు ఉండి పొజిషన్‌లో లేని దరఖాస్తులను పరిశీలించాలన్నారు. హైకోర్టు నుంచి అనుమతి రాగానే సాదాబైనామాలను పరిష్కరిస్తామన్నారు. గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూముల పట్టాలు ఎవరైనా విక్రయిస్తే ఆ పట్టాలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వారు భూమి లేని నిరుపేదలైతే ప్రభుత్వం చర్చించి ఎంత భూమి క్రమబద్ధీకరించాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అటవీ భూముల వివాదాల పరిష్కారానికి కూడా కృషి చేయాలని అన్నారు. నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అర్బన్ పీఎం ఆవాస్ యోజన కింద లక్షా 13 వేల ఇండ్లు మంజూరయ్యాయని, ప్రతీ నియోజకవర్గ పరిధిలోని పట్టణ ప్రాంతాలలో కనీసం 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా చూడాలని మంత్రి అన్నారు. పీఎంఎల్‌ఏ పోర్టల్‌లో లబ్ధిదారుల ధ్రువీకరణ ఆధార్ నెంబర్‌లతో పూర్తి చేయాలని, దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి మొదటి విడత కింద 700 కోట్ల పైగా నిధులు వస్తాయన్నారు. ఇంటి నిర్మాణాలను 600 చదరపు అడుగులలోపు లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను చేపట్టేలా చూడాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి వేణు, ఆర్డీఓలు బి.గంగయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రాజేశ్వర్, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో అడ్మిషన్లను పెంచండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి

ధర్మారం, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల పెరుగుదలకు అధ్యాపకులు కృషి చేయాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ప్రత్యేకాధికారి కె.వసుంధరదేవి, డీఐఈవో కల్పన అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో బోర్డు రూపొందించిన 20 రోజుల కార్యాచరణను తక్షణమే అమలు చేయాలని అధ్యాపకులను ఆదేశించించారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు సబ్జెక్టులను అర్థం చేసుకొని చదవాలని, అధ్యాపకుల ద్వారా అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు సప్లమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.గీతారాణి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే



గోదావరిఖని, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావును శుక్రవారం సెక్రెటేరియేట్‌లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రామకృష్ణారావు అనుభవం, పరిపాలన, నైపుణ్యం ద్వారా రాష్ట్రం అభివృద్ధిలో మరింత పురోగతి సాధిస్తుందని మక్కాన్‌సింగ్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

6న జాబ్‌మేళా

పెద్దపల్లి కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఈనెల 6న కలెక్టరేట్ భవన సముదాయంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ గ్రూప్ సర్వీసెస్ మేడ్చల్ సంస్థలో 50 వేర్‌హౌసింగ్ అసోసియేట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వీరి వయస్సు 18-35లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 6న ఉదయం 11గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో రూం నంబర్ 225లో పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 6309518695, 7093172221, 8985336947లో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు.

జిల్లాలో ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటి వరకు 82,136.74 టన్నుల కొనుగోలు
- రైతుల ఖాతాల్లో రూ.130. 94 జమ
- సన్న ధాన్యం కొనుగోళ్లలో జాప్యం



ధర్మారం మండలం శాయంపేటలో కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు 82,136.74 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా శుక్రవారం ఒక్క రోజే 15,199 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గడిచిన యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 2 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో 30 శాతం సన్నరకం వరి సాగు చేశారు. మొత్తం 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తా యని అధికారులు అంచనా వేశారు. ఇందులో 50 వేల టన్నుల ధాన్యం విత్తన కంపెనీలకు పోతుంది. 4 లక్షల టన్నుల వరకు కేంద్రాలకు వస్తుందని అధికారులు భావించారు. కొందరు రైతులు ధాన్యాన్ని ముందుగానే రైస్‌మిల్లర్లకు విక్రయించారు. 2.75 లక్షల టన్నుల వరకు కేంద్రాలకు వచ్చే అవకాశాలున్నాయి.

జిల్లాలో వరి కోతలు ఇరవై రోజుల నుంచి నడుస్తున్నాయి. ఎనభై శాతానికి పైగా కోతలు పూర్తి కాగా, రైతులు ధాన్యాన్ని ఆరబోసి కొనుగోలు కేంద్రా లకు తీసుక వస్తున్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 333 కేంద్రాలకుగాను 315 ప్రారంభించారు. ఐకేపీ ద్వారా 67 కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ద్వారా 266 కేంద్రాలు, హాకా ద్వారా 4 కేంద్రాలను ఆరంభించారు. ఇప్పటి వరకు 189 కోట్ల 71 వేల రూపాయల విలువైన 82,136.74 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 10,152 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం 81,308.30 టన్నుల ధాన్యాన్ని, సన్నరకం 828.44 టన్నుల ధాన్యాన్ని కొను గోలు చేశారు. ఆన్‌లైన్‌లో 96 శాతం ధాన్యం కొనుగోళ్ల వివరాలను నమోదు చేయగా, 56,700.76 టన్నుల ధాన్యానికి సంబంధించి 7,016 మంది (69 శాతం) రైతుల ఖాతాల్లో 130 కోట్ల 94 రూపాయలును జమ చేశారు.

పది రోజుల క్రితం వరకు ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగింది. కేంద్రాలను ఆరంభించారు గానీ, రైస్‌మిల్లుల అలాట్‌మెంట్‌లో జాప్యం జరిగింది. 25 శాతం బ్యాంకు గ్యారంటీలు ఇవ్వనిదే ధాన్యం కేటాయింపులు చేయరాదనే నిబంధన ప్రభుత్వం విధించింది. బ్యాంకు గ్యారంటీలు సమర్పించడంలో రైస్ మిల్లర్లు కావాలనే జాప్యం చేశారని తెలుస్తున్నది. కేంద్ర ప్రభుత్వం విధించిన మద్దతు ధర చెల్లించేందుకు ధాన్యంలో తేమ 17 శాతానికి మించి ఉండకూడదు. ఇది యాసంగి సీజన్ కావడం తో వరి కోసిన తర్వాత నాలుగైదు రోజులకే నిర్ణీత తేమ శాతం వచ్చిం ది. కానీ కొనుగోళ్లలో జాప్యం జరగడం వల్ల ధాన్యం బాగా ఎండిందని రైతులు తెలిపారు. 26వ తేదీ నాటికి కేవలం 28,404 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొను గోలు చేశారు. ఆ తర్వాత నుంచి ధాన్యం కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కేంద్రాల్లో వేగంగా తూకం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

● సన్న రకం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం..

ఈ సీజన్‌లో రైతులు 30 శాతం వరకు సన్న రకం ధాన్యాన్ని సాగు చేశారు. ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారని రైతులు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 828.44 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. గురువారం నాటికి 415.88 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, శుక్రవారం 422.64 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్న రకం ధాన్యాన్ని పండించే రైతులకు క్వింటాలు ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందజేస్తున్నది. గడిచిన వానాకాలం నుంచి ఈ బోనస్

(మిగతా 8వ పేజీలో)

అకాలవర్షంతో తడిసిన ధాన్యం



మంథని మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం కుప్పలు

మంథని/మంథనిరూరల్ మే 2 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో మంథని మున్సిపాలిటీ పరిధి, మండలంలోని వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోయింది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో గురువారం అర్ధరాత్రి తర్వాత భారీ గాలి వానతోపాటు భారీగా వర్షం కురిసింది. దీంతో సింగిల్‌విండో ద్వారా 35 కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ద్వారా 3 కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి ఉన్న ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. మంథని మార్కెట్ యార్డులో భారీగా ధాన్యం తడిసింది. శుక్రవారం ఉదయం వరి కుప్పల మధ్య నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కుప్పలపై పాలిథిన్ కవర్లు, టార్పాలిన్లు కప్పినప్పటికీ బలంగా వీచిన గాలి దుమారంతో కొట్టుకుపోయాయి. మండలంలోని ఆరెంద, మల్లారం, వెంకటాపూర్ ప్రాంతాల్లో భారీ వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. వరి కోతలు కాని పొలాల్లో పంటలు నేలవాలడం, గింజలు రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాల వలన ఆరెంద, గోపాల్‌పూర్, ఎక్లాస్‌పూర్, నాగెపల్లి, అడవిసోమన్‌పల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఆరబెట్టడానికి ఇబ్బందులు పడ్డారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు



సమీక్ష సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, పోలీస్ అధికారులు

పెద్దపల్లిటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీసీపీ కరుణాకర్‌తో కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అధికంగా ట్రాఫిక్ ఉండే జంక్షన్ల వద్ద అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పాఠశాల వద్ద స్కూల్ జోన్ బోర్డులు ఉండాలని, పెద్దపల్లిలోని కూనారం జంక్షన్, కమాన్ జంక్షన్, బస్‌స్టాండ్, మంథని ఫ్లైఓవర్ వద్ద రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని, అవసరమైన లైటింగ్ సౌకర్యం కల్పించాలని, జంక్షన్ల కంటే ముందు ఇరు వైపులా అవసరమైన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లారీలు, ట్రాక్టర్‌లు, భారీ వాహనాలు, కార్లకు ముందు వెనుక తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండాలని, రాజీవ్ రహదారి పై అవసరమైన చోట పోలీస్, ఆర్టీవో అధికారుల సమక్షంలో రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారిపై టర్నింగ్ వద్ద రేడియం స్టిక్కర్లతో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై విస్తృత ప్రచారం కల్పించాలని, బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ లిమిట్ బోర్డులను, యాక్సిడెంట్ ఏరియాలో స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బి ఈఈ భావ్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏసీపీలు రమేష్, కృష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకులు బండి ప్రకాష్, ట్రాఫిక్ సిఐ, ఎస్‌ఐలు, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా తయారు చేయాలి

పెద్దపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల తుది జాబితా రెండు రోజుల్లో తయారు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల ధ్రువీకరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడతల్లో పాలకుర్తి మండలానికి 594, అంతర్గాం మండలానికి 512 ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇందిరమ్మ కమిటీల నుంచి సేకరించిన అర్హుల జాబితాను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. రెండు రోజులలో ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులో, కాదో తేల్చాలన్నారు. అనర్హులు ఎవరైనా ఉంటే జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. మండలాల్లో తుది లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తే జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదం తీసుకొని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తారన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రాజేశ్వర్, తహసీల్దార్ జ్యోతి, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయం వేళ బస్సులు నడిపించరూ...

- ధర్మారం-కరీంనగర్ మధ్య ప్రయాణికుల ఇబ్బందులు
- ఉదయం 8 నుంచి 10 వరకు ఒకటే బస్సు
- బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్

6



ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు

చెట్టుపై నుంచి పడి కార్మికుడి దుర్మరణం 6

గోదావరిఖనిలో రౌడీషీటర్లపై హత్యాయత్నం 6

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు 7
- ట్రాక్టర్, కారు ఉంటే అనర్హత
- నిబంధనలు కఠినతరం

ప్రారంభమైన ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు 7
- కరీంనగర్ జోన్ పరిధిలో 12కేంద్రాలు
- 5628మంది అభ్యర్థులకు 5356మంది హాజరు

దోస్త్ నోటిఫికేషన్ విడుదల 7

అధికారులను బెదిరించడం సరైంది కాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, మే 2(ఆంధ్రజ్యోతి): రామగుండంలో పాలన గాడి తప్పిందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నేతలే అధికారులను బెదిరించడం సరైంది కాదని, రామగుండంలో మెడికల్ కళాశాల తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌దన్నారు. ఇటీవల అంతర్గాం మండల తహసీల్దార్‌పై ఓ కాంగ్రెస్ నాయకుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి బదిలీ చేయించాడని, ఇటీవల గోదావరిఖనిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి తనిఖీకి వచ్చిన డీఎంహెచ్‌వోను కాంగ్రెస్ నాయకుడు బెదిరించడం సరైంది కాదన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో వైద్యులకు తాము అండగా నిలిచా మని, గతంలో ఇక్కడ పని చేసిన ఓ పిల్లల వైద్యుడిపై దాడి చేయించి ఇక్కడి నుంచి వెళ్లగొట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని, మక్కాన్‌సింగ్ ఎమ్మెల్యే అయిన తరువాత వైద్యులకు అండగా ఉంటానని మాట్లాడడం విడ్డూరం గా ఉందన్నారు. ఎమ్మెల్యే పాలనపై దృష్టి పెట్టాలని, అధికారులను బెదిరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అభిషేక్‌రావు, కృష్ణవేణి, విజయ, మురళీధర్‌రావు, సంధ్యారెడ్డి, పిల్లి రమేష్, వాసు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు గుర్తింపు

● 65 ఎకరాల్లో బోర్డులు పాతిన అధికారులు

కాల్వశ్రీరాంపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూము లను రెవెన్యూ అధికారులు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూ ములు ఉన్నాయి. అయితే గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దారులు నిరుపేదలను గుర్తించి ఇవ్వవలసిన ప్రభుత్వ భూములను వీఆర్‌ఏ, వీఆ ర్వో, మధ్య దళారులతో మామూళ్లు పుచ్చుకొని అక్రమ పట్టాలు చేసినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యాపారు లకు, ధన వంతులకు వ్యవ సాయ భూములు ఉన్నవారికి కూడా అక్రమ పట్టాలు చేశారని పేర్కొంటున్నారు. ఈ విషయంపై గతంలో కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది.

ప్రస్తుత ప్రభుత్వం రోడ్ సైడ్ ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశిం చడంతో సంబంధిత రెవెన్యూ అధికారులు రోడ్డు సైడ్ ఉన్న సుమారు 65 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశారు. కాల్వ శ్రీరాంపూర్‌లో 597 సర్వే నంబర్లలో 11 ఎకరాలు, 613 సర్వే నంబర్‌లో 23 గుంటలు, పందిళ్లలో 805 సర్వే నంబర్‌లో నాలుగున్నర ఎకరాలు, పెద్దంపేటలో 20ఎకరాలు, 66 సర్వే నంబర్‌లో మూడున్నర ఎకరాలు, పెద్దరాతిపెల్లిలో 100 సర్వే నంబర్‌లో 7 ఎకరాలు, సోలార్ దగ్గర పెద్దరాతి పెల్లిలో పది ఎకరాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం మం డలంలో 65 ఎకరాలను రోడ్డు వైపున ఉన్న వాటిని గుర్తించి బోర్డులు పాతారు. అక్రమంగా పట్టాలు చేసుకున్న విషయంపై కలెక్టర్ స్పందిం చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు మం డలంలోని రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటుచేసిన రెవిన్యూ అధికారులు

ఉరివేసుకొని వృద్ధుడి బలవన్మరణం

మానకొండూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పోలం పోచాలు(76) శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పోచంపల్లికి చెందిన పోచాలుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా అందరికి వివాహాలు జరిగాయి. ఇద్దరు కుమారులు కరీంనగర్‌లో ఉంటున్నారు. పోచాలు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని పలు ఆసుపత్రులలో చికిత్స చేయించారు. అయినా కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో ఇంటి ముందు గల బాత్ రూంలో ఇనుప రాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి పెద్ద కుమారుడు రవి ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

కుంటలో చేపలు పడుతూ ఒకరి మృతి

శంకరపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లి శివారులోని కుంటలో శుక్రవారం చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం కొల్లూరి చంద్రమౌళి(62), అతనిభార్య పొలంవద్దకు వెళ్లారు. పొలం సమీపంలో ఉండే చింతకుంటలో దంపతులు ఇద్దరు చీరను ఇరువైపులా పట్టుకొని కుంటలో చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో చంద్రమౌళి చీరను పట్టుకొని నీటిలో ముందుకు నడుస్తూ ఉండగా ప్రమాదవశాత్తు కుంటలో ఉన్న లోతైన బురదగుంతలో పడి మునిగిపోయాడు. గమనించిన అతని భార్య సరమ్మ, ఇతరులు చీరతో లాగుతూ బయటకు తీసుకువచ్చే సరికి అప్పటికే నీటిలో ఊపిరాడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేశవపట్నం ఎస్సై కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

చెట్టుపై నుంచి పడి కార్మికుడి దుర్మరణం


యోగేశ్వర్ (ఫైల్)

జ్యోతినగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మనెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో శుక్రవారం చెట్టుపైనుంచి కిందపడి యోగేశ్వర్ సునాని(45) అనే వలసకార్మికుడు మృతి చెందాడు. టౌన్‌షిప్‌లోని చైతన్య పాఠశాల ఆవరణలో ఎన్టీపీసీ నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం(జెమ్) ఏర్పాట్లకు సంబంధించి కాంట్రాక్టరు వద్ద యోగేశ్వర్ పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం భోజనవిరామ సమయంలో పక్కనేఉన్న ఒకక్వార్టర్స్‌లోని మామిడిచెట్టుకాయలు కోసేందుకు యోగేశ్వర్ చెట్టెక్కాడు. ప్రమాదవశాత్తు జారికిందపడగా తీవ్రంగా గాయపడిన అతడిని ఎన్టీపీసీ ఆసుపత్రికితరలించి చికిత్సచేస్తుండగా చనిపోయాడు.మృతుడు వీకే రామయ్య కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడికిభార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి కుటుంబానికి 3.5లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియాతోపాటు అంత్యక్రియల కోసం రూ.50వేలు ఇచ్చేందుకు కాంట్రాక్టరుతో ఒప్పందం కుదిరింది. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీలో పనిచేసే మల్టిపర్పస్ వర్కర్ నర్సయ్య (51) ఇసుక లారీ ఢీకొని మృతిచెందాడు. గ్రామ పంచాయతీలో మల్టిపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏడెళ్ల నర్సయ్య అనే కార్మికుడు శుక్రవారం పనులు పూర్తి చేసుకొని గ్రామ పంచాయతీ కార్యాలయానికి సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్దపల్లి నుంచి మంథనికి ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ వేగంగా ఢీకొనడంతో నర్సయ్య లారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ప్లంబర్ మృతి

పెద్దపల్లిటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): వృత్తిలో భాగంగా ఓ ఇంట్లో పని చేస్తుండగా కరెంట్ షాక్ గురై ప్లంబర్ శుక్రవారం మృతి చెందాడు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గజ్జెల శ్రీనివాస్ (45) పట్టణంలోని సుభాష్‌నగర్‌లో గోడలను కట్‌చేస్తుండగా అందులోఉన్న కరెంట్ వైర్‌కు విద్యుత్తు సరఫరా జరిగి షాక్‌తో కిందఉన్న రాళ్లపై పడ్డాడు. తల వెనుకభాగంలో బలంగా దెబ్బతగలడంతో మృతిచెందాడు. మృతుడి కూతురువైష్ణవి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

భర్తపై హత్యాయత్నం చేసిన భార్య

ధర్మపురి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బలగూడెం గ్రామానికిచెందిన తట్ల పోచంపై భార్య లక్ష్మి గురువారం హత్యాయత్నానికి పాల్పడింది. ఎస్ఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. తట్ల పోచం నిత్యంతాగివచ్చి భార్యలక్ష్మితో గొడవపడుతుండేవాడు. ఈనెల1న తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. భరించలేక భర్తను చంపాలనే ఉద్దేశంతో లక్ష్మి ఇంట్లోని బాడిశతో అతడితల, ముఖంపైన దాడిచేసింది. తీవ్రంగా గాయపడిన పోచంనుఆసుపత్రికి తరలించారు. పోచంకొడుకు మహేందర్ ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బుగ్గారం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన మ్యాదరవేని విజయ అనే మహిళా రైతుకు చెందిన గేదె శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. రైతు వివరాల మేరకు శుక్రవారం మేతకు వెళ్లిన గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఎర్త్ వైరుకు కరెంట్ సరఫరా కావడంతో అటుగా వెళ్లిన గేదెకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.85 వేలు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఈప్రాంతంలో నలుగురు రైతుల గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయని, పలుసార్లు విద్యుత్ అధికారులకు కంచె ఏర్పాటు చేయాలని విన్నవించుకున్న పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఉదయం వేళ బస్సులు నడిపించరూ..

● ధర్మారం-కరీంనగర్ మధ్య ప్రయాణికుల ఇబ్బందులు ● ఉదయం 8 నుంచి 10 వరకు ఒకటే బస్సు ● బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్

సరైన సమయానికి ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యార్థులు కాలేజీలకు, ఉద్యోగులు ఆఫీసులకు వెళ్తుంటారు. ఈ సమయంలో ఆర్టీసీ బస్సుల్లేక విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



ధర్మారం, మే 2 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి రోజూ వేలాది మంది ప్రయాణిస్తుంటారు. పెద్దపల్లి, జగిత్యాల, లక్షెట్టిపేట నుంచి వచ్చే ప్రయాణికులకు ధర్మారం బస్టాండ్ సెంటర్ పాయింట్‌గా ఉంటుంది. ఈ రూట్లలో వచ్చే బస్సుల్లో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు ధర్మారం బస్టాండ్ చేరుకొని అక్కడి నుంచి కరీం నగర్‌లో వెళ్తారు. .

ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలాల నుం చి విద్యార్థులు కరీంనగర్‌లోని వివిధ కళాశాలలకు వెళ్తుంటారు. వీరంతా ఉదయం 9 గంటలకు కాలేజీలకు చేరుకోవడానికి గ్రామాల నుంచి 7 గంటల వరకు ధర్మారం బస్టాండ్ చేరుకుంటున్నారు.


ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు

ధర్మారం బస్టాండ్ నుంచి 7 గంటలకు ఒక బస్సు ఉండగా దాని తరువాత 9.20 నిమిషాల వరకు బస్సు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 7 నుంచి 9 గంటల మధ్యలో ఒకటి రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నా అవి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు కావడంతో ప్రయాణికులతో ఉంటుంది.

ఆ బస్సులో పది మంది వరకు విద్యార్థులు అతి కష్టం మీద ఫుట్ బోర్డు ప్రయాణం చేస్తూ కరీంనగర్ చేరుకుంటుండగా, మిగతా వారు గంటల తరబడి బస్టాండ్‌లోనే నిరీక్షిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9 తరువాత వచ్చే బస్సుల్లో విద్యార్థులు కాలేజీలకు చేరుకునే సరికి 10.30 అవు తుందని, దీంతో కళాశాల సిబ్బంది అనుమతించ డం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, వివిధ పనులపై కరీంనగర్ వెళ్లె ప్రయాణికులతో ధర్మారం బస్టాండ్ ఉదయం రద్దీగా ఉంటుంది. కాలేజీ, ఆఫీసు సమయాల్లో ధర్మారం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండు గంటలుగా ఎదురుచూపులు
చల్లూరి మహిత. (విద్యార్థిని, పాతగూడూర్)



ఎండపల్లి మండలం పాతగూడూర్ గ్రామం. శ్రీచైతన్య కాలేజీలో బీటెక్ చేస్తున్నా. మా ఊరి నుంచి 7 గంటల వరకే బస్టాండ్‌కు వచ్చాను. బస్సు కోసం రెండు గంటలు ఎదురుచూడాల్సి వస్తోంది. ఎక్స్‌ప్రెస్ వచ్చిరా అందులో జాగలేక ఎక్కలేదు. ఒక్క బస్సులో 110 మంది ప్రయాణిస్తున్నారు. ధర్మారం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలి.

కళాశాలకు అనుమతించడం లేదు
అట్ల సమత (విద్యార్థిని, చామనపల్లి)



ధర్మారం మండలంలోని చామనపల్లి గ్రామం. మా ఊరు నుంచి బస్సులో ధర్మారం వచ్చాను. బస్టాండ్‌లో కరీంనగర్‌కు బస్సులు ఉండడం లేదు. 9.20 కి బస్సు వస్తుంది. బస్సులో బాగా రద్దీగా ఉండి నిలబడాల్సి వస్తోంది. కళాశాలకు వెళ్లే వరకు 10.30 అవుతుంది. దీంతో కళాశాల యాజయాన్యం లోపలికి అనుమతించడం లేదు. మధ్యాహ్నం లంచ్ టైం వరకు బయటే ఉండాల్సి వస్తోంది. ఉదయం వేళలో బస్సుల సంఖ్య పెంచాలి.

గోదావరిఖనిలో రౌడీషీటర్లపై హత్యాయత్నం


గాయపడిన చీమల తిరుపతి

కోల్‌సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లో శుక్రవారం చీమల తిరుపతి(38) అనే రౌడీషీటర్‌పై హత్యాయత్నం జరిగింది. బోనగిరి రాకేష్ అలియాస్ రాజేంద్రకుమార్, రాగుల రాజశేఖర్‌లు పాతగొడవలను మనసులో పెట్టుకుని తల్వార్, కత్తితో దాడి చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన తిరుపతిని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అతనిపరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. చీమల తిరుపతి, రాకేష్, రాజశేఖర్‌లు 2021లో జరిగిన సీపీఎంకార్యకర్త బండారి మొగిలి హత్య కేసులో నిందితులు. అదే కాలనీకిచెందిన మొగిలిని భూ వివాదంలో హత్య చేసినట్టు కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో చీమల తిరుపతి ప్రధాననిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం ఈ కేసు ట్రయల్‌కు వచ్చింది. రాజశేఖర్, రాకేష్‌లు ఈకేసును రాజీ చేసుకుందామని చీమల తిరుపతిపై ఒత్తిడి పెడుతున్నట్టు తెలుస్తుంది. అతడు కేసు రాజీకి ఆసక్తి కనబర్చకపోవడంతో వీరి మధ్య విభేదాలు తలెత్తినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. శుక్రవారం ప్రశాంత్ నగర్‌లో తిరుపతి వెనుక వెళ్లిన రాకేష్, రాజేష్‌లు అతనితో ఘర్షణ పడి పక్కనే ఉన్న ఒకఆన్‌లైన్ సెంటర్‌లోకి లాక్కువెళ్లి తల, చేతిపై కత్తులతో దాడి చేశారని పోలీసులు తెలిపారు. బాధితుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ఓదెల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడక నుంచి కనగర్తి వెళ్లే రోడ్డుమూలమలుపు వద్ద గురువారం రాత్రి లారీబోల్తాపడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సుల్తానాబాద్, సుద్దాల ఇటుక బట్టీల నుంచి లారీ ఓదెల మండలం కనగర్తి మీదుగా పొత్కపల్లి వైపు వస్తుండగా మడక మూలమలుపు వద్ద బోల్తా పడింది. ప్రమాదంలో భూపాలపల్లి జిల్లా కొయ్యూరుకుచెందిన డ్రైవర్, ఓనర్ కుంభం మహేష్ తలకు గాయాలయ్యాయి. ప్రస్తుతం కొయ్యూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నారు. నల్ల మట్టిని రవాణా చేసి ఇటుక బట్టీల వద్ద అన్‌లోడ్ చేసిన తర్వాత, అక్కడి నుంచి మళ్లీ మట్టిలోడు కోసం వేగంగా వస్తుండగా ప్రమాదం చోటుచేసుకొంది. మూడేండ్ల క్రితం ఇదే మూల మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. ప్రమాదకరంగా ఉన్న ఈ మూలమలుపు వద్ద హెచ్చరిక బోర్డు లేదా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ

పెద్దపల్లి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ అయ్యాయని రైతు పెర్క రాజు పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ధాన్యాన్ని కేంద్రంలో ఆరబోయగా గురువారం రాత్రి గుర్తు తెలియన దుండగులు సుమారు 4 బస్తాల వరకు ధాన్యం ఎత్తుకెళ్లారని రైతు రాజు ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు కాని ధాన్యానికి ఎలాంటి రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. పరిహారం చెల్లించి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు.

మొబైల్ ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి

● జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్



బాధితురాలికి ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, జిల్లా పోలీసులు సూచించిన సీఈఐఆర్ అప్లికేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు పోగొట్టుకున్న రూ.20లక్షల విలువైన 102సెల్‌ఫోన్‌లను ఎస్పీ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోన్‌లు పోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెంటనే ఫిర్యాదు చేస్తే ఫోన్‌లను స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మొబైల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 986 ఫోన్‌లు రికవరీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్‌ల రికవరీలో ప్రతిభ కనబరచిన ఇన్‌స్పెక్టర్ రఫీక్, ఆర్ఎస్ఐ కృష్ణ తదితరులను ఎస్పీ అభినందించారు.

అదుపుతప్పిన కారు.. ఒకరికి స్వల్పగాయాలు

వేములవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మొదటి బైపాస్ రహదారిలో గల మహాలక్ష్మివీధి ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున మారుతి బ్రీజా కారు అదుపుతప్పి చెట్టునుఢీకొంది. వేగంగా దూసుకువచ్చి చెట్టును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఒకరికి స్వల్పగాయాలు కాగా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

గాలికి ఎగిరిపోయిన రేకుల షెడ్డు

శంకరపట్నం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్‌లో గురువారం అర్ధరాత్రి వీచిన గాలికి పూదరి రవి-రమ దంపతులు ఇంటిముందు వేసుకున్న రేకులషెడ్డు పైపులతోసహా లేచి సమీపంలో ఉన్న టేకుచెట్ల కొమ్మలకు తట్టుకొని ఆగింది గాలి దుమారానికి కొన్ని రేకులు ముక్కలు ముక్కలయ్యాయి. సుమారు రూ.40వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఆస్తినష్టంపై పంచాయతీ కార్యదర్శి ఎలగందుల శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

కొడిమ్యాలలో వివాహిత హత్య


మమత(ఫైల్)

కొడిమ్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన అవుదుర్తి మమత(35) హత్యకు గురైంది. సంఘటన స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలంరవి పరిశీలించారు. కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ శుక్రవారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. 20సంవత్సరాల క్రితం కొడిమ్యాలకు చెందిన అవుదుర్తి మహేందర్ గంగాధర మండలం మల్లాపూర్‌గ్రామానికి మమతకు వివాహం జరిగింది. సంవత్సరం నుంచి భర్త మహేందర్, అత్తమామలు వజ్రవ్వ, లక్ష్మణ్, మరుదులు అనిల్, వెంకటేష్ ఆస్తితగాదా విషయంలో మమతను కట్నం తీసుకరాలేదని, సంతానం లేదని మానసికంగా వేధిస్తున్నారు. ఆస్తి తగాదాల విషయంలో తన తల్లిగారింటివద్ద ఉంటున్న మమతను గతనెల 26న మహేందర్ కొడిమ్యాలకు తీసుకువచ్చి హత్యచేశాడు. అనంతరం 28న కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తనభార్య కనబడడంలేదని ఫిర్యాదుచేశాడు. మహేందర్‌ను మమత తల్లి దండ్రులు నిలదీయగా మాట దాటవేసాడు. అనుమానంతో శుక్రవారం కొడిమ్యాలలో తాళం వేసిన ఇంటిని తనిఖీచేసి చూడగా మమత మృతదేహం కనిపించింది. అల్లుడు మహేందర్ తన కూతురు మమతను హత్య చేశాడని మృతురాలి తల్లి రాచకొండ పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తునట్లు ఎస్సై వివరించారు.

కోనరావుపేటలో చిరుత సంచారం

కోనరావుపేట, మే 2 (ఆంధ్రజోతి): కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గుట్ట ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నదని ఫారెస్ట్‌సెక్షన్ ఆఫీసర్ పల్లె శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం వెంకట్రావుపేట బస్టాండ్ ప్రాంతం సమీపంలోని పల్లెప్రకృతి వనంను ఆనుకుని ఉన్న గద్దగుట్ట నుంచి చిరుత పొలాల వైపు వెళ్లిందన్నారు. కొండాపూర్ గ్రామానికి చెందిన దండురవి ట్రాక్టర్ నడుపుకుంటూ వెళుతుండగా శుక్రవారం రాత్రి 7గంటలకు చిరుత రోడ్డు దాటుతుండడాన్ని గమనించాడన్నారు. ఈ విషయం తెలుసుకుని అధికారులు కే సుదర్శన్, బీ అభిషేక్‌రావుతో కలిసి తాను ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని తెలిపారు. వెంకట్రావుపేట గుట్ట నుంచి కిందికి దిగి పొలాల వైపు వెళ్లినట్లుగా చిరుత అడుగులను గుర్తించామన్నారు. అటవీప్రాంత రైతులు తమ పశువులను ఇంటి వద్దనే కట్టేసి ఉంచుకోవాలన్నారు. రైతులు రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. కోనరావుపేటలో చిరుత సంచారంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.

రెండు లారీలు ఢీ


ఢీకొన్న రెండు లారీలు

జమ్మికుంట, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప దేవాలయం సమీపంలో శుక్రవారం యూటర్న్ తీసుకుంటున్న ఓ లారీని ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొట్టింది. జమ్మికుంట నుంచి గజ్వేల్ వెళ్తున్న లారీ అయ్యప్పస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న వేబ్రిడ్జివైపు వెళ్లేందుకు డ్రైవర్ యూటర్న్ తీసుకున్నాడు. అదేసమయంలో హుజూరాబాద్ నుంచి జమ్మికుంట వైపు వస్తున్న మరో లారీ వేగం ఒక్కసారిగా కంట్రోల్ కాకపోవడంతో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండు లారీలు ధ్వంసం అయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు.

పోలీస్ స్టేషన్ ఎదుట మృతుడి బంధువుల ఆందోళన


ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్థులు

జగిత్యాలరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి భూవివాదం నేపథ్యంలో గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోగా శుక్రవారం మృతుడి బంధువులు, గ్రామస్థులు జగిత్యాలరూరల్ పోలీస్ స్టేషన్‌ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మృతుడిబంధువులు మాట్లాడుతూ మృతుడు మల్లారెడ్డికి సంబంధించిన భూమిని ఆక్రమించడంతోపాటు పడిగెల గంగారెడ్డి, పడిగెల రాజిరెడ్డి, పడిగెల జనార్దన్ అనేవ్యక్తులు మల్లారెడ్డిని చంపుతానని బెదిరించడంతోనే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కూతురు శరణ్య ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్ చుట్టూ మూడునెలల నుంచి తిరిగినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. మృతుడిచావుకు బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ విషయమై జగిత్యాలరూరల్ సీఐ కృష్ణారెడ్డిని వివరణ కోరగా పడిగెల గంగారెడ్డికి మృతుడు మల్లారెడ్డికి 30 సంవత్సరాలుగా భూవివాదం జరుగుతుందన్నారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు మోఖమీదికి వెళ్లి విచారణ చేపట్టామని, భూవివాదం కాబట్టి రెవెన్యూలో గాని, కోర్టు పరిధిలో తేల్చుకోవాలని వారికి సూచించామన్నారు. మృతుడు మల్లారెడ్డిని బెదిరించినట్లు తమకు ఫిర్యాదు అందలేదని అన్నారు. మరింత లోతుగా విచారణ చేపట్టి బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని హనుమాన్ దీక్షాపరుడి మృతి

జగిత్యాల అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నటరాజ్ చౌరస్తాలో శుక్రవారం ఆర్టీసీబస్సు ఢీకొని జగిత్యాల మండలం టీఆర్‌నగర్‌కు చెందిన కృష్ణమూర్తి (53) అనే హనుమాన్ దీక్షాపరుడు మృతిచెందాడు. నిజామాబాద్ వైపు నుంచి జగిత్యాలకు వస్తున్న ఆర్టీసీ బస్సు నటరాజ్ చౌరస్తా వద్ద కృష్ణమూర్తి రోడ్డుదాటుతున్న సమ యంలో ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

● ఎమ్మెల్యే పరామర్శ..

కృష్ణమూర్తికుటుంబసభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే ఆయన ఆసుపత్రికి వెళ్లి కృష్ణమూర్తి భౌతిక కాయాన్ని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి కృష్ణమూర్తితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ చాంద్ ఉన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్



వివరాలు వెల్లడిస్తున్న పెద్దపల్లి డీసీపీ పుల్లా కరుణాకర్

బసంత్‌నగర్‌లో బైక్ దొంగల అరెస్టు

పాలకుర్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ పోలీసులు శుక్రవారం బైక్ దొంగలను అరెస్టుచేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ పుల్లా కరుణాకర్ మాట్లాడుతూ నిందితుల నుంచి రూ.4లక్షల విలువగల ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి వాహనాలను దొంగిలిస్తున్నారన్నారు. ఇద్దరినీ అరెస్టు చేశామని, ముగ్గురు మైనర్లు ఉండగా ఒక్కరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఏసీపీ గజ్జి కృష్ణ, ఎస్ఐ ఆర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో సిబ్బంది కొత్తపల్లె బస్టాప్ వద్ద ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

దోస్త్ నోటిఫికేషన్ విడుదల

గణేశ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో 2025 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దోస్త్2025 నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. మే 29న ఫస్ట్ ఫేస్ సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. ఫస్ట్ ఫేస్‌లో సీట్లు పొందిన విద్యార్థులు మే30 నుంచి జూన్ 6వ తేదీలోపు ఆయా కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. సెకండ్ ఫేస్ దరఖాస్తుల ప్రక్రియ మే 30 నుంచి జూన్ 8 వరకు కొనసాగనుంది. సెకండ్ ఫేస్‌లో కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు రూ.400 చెల్లించాలి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 13న రెండో దశ సీట్లు కేటాయించనున్నారు. జూన్ 13 నుంచి 18వ తేదీ లోపు ఆయా కళాశాల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. థర్డ్ ఫేస్ దరఖాస్తుల ప్రక్రియ జూన్ 13 నుంచి 19వ తేదీ వరకు కొనసాగనుంది. రిజిస్ట్రేషన్‌కు రూ.400 చెల్లించాలి. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. జూన్ 23న సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 23 నుంచి 28 వరకు కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించారు. జూన్ 30 నుంచి డిగ్రీ ఫస్టియర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు

- 7 నుంచి జూన్ 6 వరకు
- 13 నుంచి 23 సంవత్సరాల బాలబాలికలు అర్హులు
- కరీంనగర్, జగిత్యాల, వేములవాడ, గోదావరిఖనిలో ఏర్పాటు



వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్రికెట్ సంఘం సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో రెండు, వేములవాడ, జగిత్యాల, గోదావరిఖనిలో ఒక్కోటి చొప్పున మొత్తం ఐదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 7 నుంచి జూన్ 6 వరకు శిబిరాలను కొనసాగుతాయన్నారు. 13 నుంచి 23 సంవత్సరాల్లోపు వయస్సుగల బాలబాలికలు, యువత అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 6వ తేదీలోగా జిల్లా క్రికెట్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరాల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులతో ఈ నెల 12 నుంచి ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని అందులో రాణించే క్రీడాకారులను వచ్చే నెలలో హెచ్‌సీఏ లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిబిరాల్లో శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు మహేందర్‌గౌడ్, మనోహర్‌రావు, కోశాధికారి శ్రావణ్, సంయుక్త కార్యదర్శి కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా శ్రీవాణి



నియామక పత్రాలు అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం అదనపు పరీక్షల నియంత్రణ (కాన్ఫిడెన్షియల్) అధికారిగా అర్థశాస్త్ర విభాగపు అధిపతి డాక్టర్ కె.శ్రీవాణి నియామకమయ్యారు. శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీసీ ఉమేష్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ రవికుమార్‌కు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఇంగ్లీష్, తెలుగు, ఎంకాం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, బాటనీ, జంతు శాస్త్రం ఇలా మొత్తం కోర్సుల్లో 79 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రజనీ దేవి, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న పరీక్షల నియంత్రణ అధికారి శ్రీనివాస్ రెడ్డి

నిజాం షుగర్స్ పునరుద్ధరణపై సందిగ్ధం

- ఫ్యాక్టరీలు తెరిపించడంపై స్పష్టత కరువు
- తేలని నిర్వహణ.. ప్రభుత్వమా..ప్రైవేటా.. సహకార పద్ధతిలోనా?
- నిజామ్ షుగర్స్ పునర్‌వైభవానికి అన్నదాతల ఎదురుచూపులు

జగిత్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) పునరుద్ధరణపై సందిగ్ధం నెలకొంది. రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్లను పునరుద్ధరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అడుగులు వేసిన ప్పటికీ సరైన స్పష్టత రావడం లేదు. జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కెర కర్మాగారంతో పాటు నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లి కర్మాగారాలను తెరిపించడానికి గత యేడాది జనవరి నెలలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ కొంత ప్రక్రియ పూర్తి చేసింది. ఉమ్మడి యాజమాన్యం పరిధిలోని ఈ ఫ్యాక్టరీలకు చెందిన రూ. 400 కోట్ల బ్యాంకుల బకాయిలకు సంబంధించి వన్ టైం సెటిల్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 190 కోట్లు చెల్లించింది. నిజాం షుగర్స్‌ను పునరుద్ధరించినప్పటికీ తాము నడపలేమని భాగస్వామ్య సంస్థ అయిన డెల్టా పేపర్స్ లిమిటెడ్ గతంలోనే ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

సంస్థలో 51 శాతం వాటాను కలిగియున్న డెల్టాకు స్వస్తి పలకాలంటే ఆస్తుల విలువ, సాంకేతిక స్థితిగతులు, న్యాయపరమైన చిక్కులు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. 2025 డిసెంబరు నాటికి ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రకటించినప్పటికీ.. అది మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ యేడాది క్రషింగ్ సీజన్ (అక్టోబరు నుంచి డిసెంబరు) నాటికి కర్మాగారం పరిధిలో రైతులు గణనీయమైన విస్తీర్ణంలో చెరుకు పంట పండించేందుకు ముందుకు రావాల్సి ఉంది. ఇప్పటి నుంచి వానాకాలం వరకు చెరుకు నాటేందుకు అనువైన సమయం ఉంటుందని రైతులు అంటున్నారు.

తొమ్మిదన్నరేళ్లుగా లే ఆఫ్‌లో..

నిజామాబాద్ జిల్లా బోధన్ కేంద్రంగా 1938 సంవత్సరంలో నిజాం సర్కారు నిజాం చక్కర కర్మాగారం ప్రారంభించింది. దీనికి అనుబంధంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో పరిశ్రమలను స్థాపించింది. గత పాలకుల విధానాలు, పరిశ్రమ నష్టాల బాట పట్టిందన్న కారణంతో 2002 సంవత్సరం ప్రైవేటీకరణ చేశారు. ఈ మూడు యూనిట్లు 51శాతం డెల్టా కంపెనీ, 49 శాతం ప్రభుత్వ వాటాలను కలిగి ఉన్నాయి. అయినా నష్టాల నుంచి బయట పడకపోవడంతో 2015 డిసెంబరు 23వ తేదీన లేఆఫ్‌గా ప్రకటించి బోధన్, ముత్యంపేట, ముంబోజుపల్లి కర్మాగారాలను యాజమాన్యం మూసివేసింది.

అనంతరం బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో కర్మాగారాలను తెరిపిస్తామని హామీనిచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాల పునరుద్ధరణపై కసరత్తులు చేస్తోంది. రాష్ట్ర మంత్రి శ్రీదర్‌బాబు చైర్మన్‌గా ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైస్ చైర్మన్‌గా సభ్యులుగా జగిత్యాలకు చెందిన మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, పలు విభాగాలకు చెందిన రాష్ట్రస్థాయి అధికారులను నియమించింది. కమిటీ ఇప్పటికే కర్మాగారాలను సందర్శించి ప్రభుత్వానికి సమాచారం అందించింది.

తేలని డెల్టా వాటా వ్యవహారం..

నిజాం షుగర్స్‌పై అధ్యయనం చేసి ఆస్తుల విలువను లెక్కించి అవసరమైన సలహాలు, సూచనలతో నివేదికను సమర్పించడానికి క్యాపిటల్ ఫార్చ్యూన్స్ అనే సంస్థను కన్సల్‌టెంట్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించింది. సాధ్యమైనంత తొందరలో కన్సల్‌టెంట్ కంపెనీ అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని ఆదేశించింది. ప్రస్తుతం కర్మాగారాల్లోని యంత్రాలు వినియోగించే స్థితిలో ఉన్నాయా...మరమ్మతులతో నడిపించుకునే వీలు ఉంటుందా..లేదంటే కొత్తవి కొనుగోలు చేయాలా అన్న వివరాలు సేకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్‌డీఎస్‌ఎల్ తరఫున సమాచారం ఇచ్చేందుకు సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ డిప్యూటీ డైరెక్టర్‌ను సమన్వయ అధికారిగా ప్రభుత్వం నియమించినట్లు ప్రచారం జరుగుతోంది. కన్సల్‌టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడానికి యోచిస్తున్నారు. డెల్టా వాటాను తిరిగి అప్పగించి స్వస్తి పలకాలంటే ఏమి చేయాలన్న అంశం తేలడం లేదు.

నిర్వహణపై రాని స్పష్టత...

ఎన్‌డీఎస్‌ఎల్‌లో భాగస్వామిగా ఉన్న డెల్టా కంపెనీకి స్వస్తి పలికి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కర్మాగారాలను ఎలా నిర్వహించాలన్న అంశంపై కమిటీ సభ్యులతో పాటు ప్రభుత్వ పెద్దలు పలు విధాలుగా సూచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ ఉండాలా.. ప్రైవేటు కంపెనీకి బాధ్యతలు అప్పగించాలా.. సహకార పద్ధతిలో నిర్వహించాలా అన్న అంశంపై ఇంకా స్పష్టత రావడం లేదు. సహకార పద్ధతిలో నడిచే షుగర్ ఫ్యాక్టరీల ప్రోత్సాహకానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయడంతో నిధులు రావాలంటే సహకార విధానం అనుసరించాలా అన్న చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.

ప్రస్తుత యేడాది డిసెంబరు నాటికి కర్మాగారాలను పునరుద్ధరణ జరుగుతుందని కమిటీ వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన అంశాలపై స్పష్టత రావడం లేదు. ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయాలు జరిగితేగాని పునరుద్ధరణ ముందుకు పడే అవకాశాలు లేవన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కర్మాగార పునరుద్ధరణపై అన్నదాతలు ఆశతో ఎదురు చూస్తున్నారు.



జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కెర కర్మాగారం

వేములవాడలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 2(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం తెల్లవారు జామును నుంచి రాజన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవోలు శ్రావణ్ కుమార్, అశోక్‌కుమార్‌లు సూపరింటెండెంట్‌లు వరి నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ రాజేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న ఆలయ ప్రాంగణంలో భక్తులు

ఘనంగా ఆరుద్ర నక్షత్రోత్సవము..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పరివార దేవతార్చనలు సదస్యం గావించారు. కాగా రాజన్న ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జగద్గురు శంకరాచార్యులు జయంతి శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం సదస్యము వసంతమాధవ పూజ కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

రాజన్న సేవలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌లు..

రాజరాజేశ్వర స్వామివారిని డిప్యూటీ కమిషనర్‌లు కృష్ణప్రసాద్, టంకశాల వెంకటేష్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌లు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజ అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఏఈవో శ్రావణ్ కుమార్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వెంట నును గొండ రాజేందర్, ఎడ్ల శివసాయి, పురాణం వంశీమోహన్, గొట్టం గిరిబాబు తదితరులు ఉన్నారు. కాగా, వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించిన కూరగాయల శంకర్ పదవీ విరమణ చేశారు. ఆలయ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో శంకర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

వైభవంగా పార్వతీ కోటేశ్వరస్వామి కల్యాణం

- పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించిన విప్ అడ్లూరి
- ఆది దంపతుల కల్యాణం తిలకించి తరించిన భక్తులు



కోటిలింగాలలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాలలో పార్వతీ కోటేశ్వరస్వామి ఆలయమంలో శంకర జయంతి సందర్భంగా పార్వతీ కోటేశ్వరస్వామి వారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన అభిషేకాదుల వంటి పూజలు నిర్వహించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామివారలకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ మద్దుల గోపాల్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు స్వామివారి కల్యాణానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం కరీంనగర్‌కు చెందిన అంబటి అనూష- రవీందర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్‌శర్మ, అన్వేష్ శర్మ, తహసీల్దార్ శేఖర్, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు నక్క రవితేజ, గోల్ల తిరుపతి, మెరుగు మురళి గౌడ్, పూదరి రమేష్, బందెల ఉదయ్‌గౌడ్, శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు

కోటిలింగాల కోటేశ్వరస్వామిని శుక్రవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి కాంతారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్‌శర్మ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ప్రారంభమైన ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

- కరీంనగర్ జోన్ పరిధిలో 12కేంద్రాలు
- 5,628మంది అభ్యర్థులకు 5,356మంది హాజరు



పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షలు ఏప్రిల్ 29, 30తేదీల్లో జరగగా, మే 2నుంచి 4వరకు ఇంజనీరింగ్ విభాగంలో పరీక్షలు జరుగనున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన ఎప్‌సెట్ పరీక్షలకు కరీంనగర్‌జోన్ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, సిద్దిపేటలో మొత్తం కలిపి 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

5,628మంది అభ్యర్థులకు 5,356మంది హాజరు..

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. ఉదయం 7.30నుంచి, మధ్యాహ్నం 1.30 నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అంటే పరీక్ష సమయానికి 90 నిమిషాల ముందునుంచే అభ్యర్థులను పరీక్షకేంద్రాల్లోకి అనుమతించారు. కరీంనగర్ జోన్ పరిధిలోని 12కేంద్రాల్లో కలిపి మొదటి సెషన్‌లో 2,813మంది విద్యార్థులకుగాను 2,672మంది(95%) అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 141 మంది హాజరు కాలేదు. రెండో సెషన్‌లో 2,815మంది విద్యార్థులకుగాను 2,684మంది (95.3%)హాజరు కాగా 131మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

గంజాయి ముఠా అరెస్ట్

9 కిలోల గంజాయి స్వాధీనం

ఓదెల, మే 2((ఆంధ్రజ్యోతి): మత్తుకు యువకులు, విద్యార్థులు దూరంగా ఉండాలని, గంజాయిని పూర్తిగా తుదముట్టించే వరకు కఠిన చర్యలు కొనసాగుతాయని డీసీపీ పుల్లా కరుణాకర్ అన్నారు. మండలంలోని పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి గంజాయి నిందితుల వివరాలను వెల్లడించారు. డీసీపీ కరుణాకర్ మాట్లాడుతూ పొత్కపల్లి రైల్వే స్టేషన్ వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ బృందం వెళ్లి పరిశీలించారని, అక్కడ అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని పట్టుకుని విచారించగా వారి వద్ద రూ.4.8లక్షల విలువ చేసే 9కిలోల 64గ్రాముల ఎండు గంజాయి లభించిందని చెప్పారు. గంజాయితో పాటు నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ తెలిపారు.

గంజాయి ముఠాకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు డీసీపీ తెలిపారు. ఇందులో ప్రధాన నిందితుడు అంతర్గాం మండలం ముర్మూర్‌కు చెందిన జాడి కిరణ్ కాగా, ఇదే గ్రామానికి చెందిన జాడి ప్రకాష్, గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన గుజ్జుల సాయి, రామగుండం చెందిన కొమురవెల్లి పవన్, అంతర్గాంకు చెందిన ఇండిబిల్లి సందీప్‌కుమార్, ముర్మూర్‌కు చెందిన లింగన్నపేట విష్ణువర్ధన్, అలాగే ఒడిస్సా రాష్ట్రంలోని ఉరుమనూర్ మండలం కలిమేలకు చెందిన కేల కుమార్‌పై కేసు నమోదు చేశామని, ఇందులో కేల కుమార్ పరారీలో ఉన్నట్టు డీసీపీ తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకున్న ఎస్‌ఐ రమేష్, ఏఎస్‌ఐ రత్నాకర్, పోలీస్ సిబ్బంది కిషన్, రాజేందర్, సతీష్‌లను అభినందించి నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.



పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

- ట్రాక్టర్, కారు ఉంటే అనర్హత
- నిబంధనలు కఠినతరం

చొప్పదండి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది. పక్కాగా పేదలకు ఇళ్లు దక్కేలా పకడ్బందీగా సర్వే చేస్తుండగా, నిబంధనలు కఠినతరంగా ఉండడంతో అనేక మందికి ఇళ్లు దక్కే అవకాశం లేదు. కారు, ఏసీ, ట్రాక్టర్‌తో పాటు చాలా నిబంధనలు రూపొందించగా, వడపోతలో లబ్ధిదారులు ఇళ్లకు అర్హత కోల్పోతున్నారు. ప్రస్తుతం చొప్పదండి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల సర్వేకు ప్రత్యేక అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను అందించింది.



నిబంధనలు ఇవే...

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) కుటుంబానికి చెందిన వారై ఉండాలి. గ్రామాల్లో నివసించే లబ్ధిదారుడి ఆదాయం నెలకు 10 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాలకు 15 వేలలోపు ఉండాలి.
- రెండున్నర ఎకరాలకు ఎక్కువ భూమి ఉన్న రైతులు అనర్హులు.
- నాలుగు చక్రాల వాహనం, ట్రాక్టర్ ఉన్న రైతులు అనర్హులు.
- లబ్ధిదారుడి కుటుంబంలో కేసీసీ (క్రాప్ లోన్) 50 వేల రూపాయలకు మించి ఉండరాదు.
- వ్యాపారం, అదనపు ఆదాయ పన్ను, ప్రొఫెషనల్ టాక్స్ చెల్లించే లబ్ధిదారులు అనర్హులు.
- లబ్ధిదారుడి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అర్హులు కారు.
- దరఖాస్తు చేసుకున్న ప్రాంత నివాసి అయి ఉండాలి.
- సంచార కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయరాదు.
- ప్రస్తుతం రేకుల షెడ్డు, గుడిసె, గునెపెంకుల ఇంటిలో నివాసం ఉన్న లబిదారుడు అర్హుడు.
- తండ్రి, ఇద్దరు కుమారులతో నివాసం ఉన్నట్లయితే ఒక్కరికే ఇందిరమ్మ ఇళ్లమంజూరు చేస్తారు.
- మున్సిపల్ ప్రాంతంలో అద్దె ఇంటిలో నివాసం ఉండే లబ్ధిదారులు అర్హులే.
- పట్టణ ప్రాంతాల్లో ఇంటి స్థలం పట్టా సర్టిఫికెట్ ఉండాలి.
- లబ్ధిదారుడికి 60 గజాల ఇంటి స్థలం ఉండాలి.
- ఇంటి స్థలానికి సంబంధించి పట్టా, ఓనర్‌షిప్ సర్టిఫికెట్ లేకుంటే ఇల్లు మంజూరు చేయరాదు.
- కొత్త ఇంటి నిర్మాణం 400 నుంచి 600 అడుగులలోపు ఉండాలి. అధికంగా ఉంటే అనుమతి ఇవ్వరాదు.
- ఇండ్ల నిర్మాణంలో రెండు గదులు, కిచెన్, మరుగుదొడ్డితో నిర్మించాలి.
- ఇంటి నిర్మాణం ఇంతకు ముందే ప్రారంభించిన, పాత ఇంటిని కలుపుకొని నిర్మించిన కొత్త ఇందిరమ్మ ఇంటికి అనర్హులే.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



సన్నవడ్లను పరిశీలిస్తున్న తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సన్న వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో 15 రోజులు గడుస్తున్నా సన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షంతో ధాన్యం తడిస్తే రైతులకు నష్టం జరుగుతుందని, ఎమ్మెల్యే విజయరమణరావు, కలెక్టర్ స్పందించాలని కోరారు. నాయకులు ఆడెపు రాజు, ఎండీ ఇబ్రహీం, కుమార్, మల్లేష్ ఉన్నారు.

అంగన్‌వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారులకు అన్న ప్రాసన చేస్తున్న ఏసీడీపీఓ

సుల్తానాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్ర కో ఆర్డినేటర్ దయా అరుణ పిలుపునిచ్చారు. పట్టణంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలలో పాల్గొన్నారు. చిన్నారులను సమీప అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏసీడీపీఓ సంపద కుమారి, సెక్టార్ సూపర్ వైజర్ స్వరూప, అంగన్‌వాడి టీచర్ వినోద ఐసీపీఎస్ సభ్యులు పాల్గొన్నారు

మిత్రుడికి అండగా నిలిచిన స్నేహితులు



మిత్రుని కూతురు వివాహం సందర్భంగా ఔదార్యం చాటుకుంటున్న స్నేహితులు

సుల్తానాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): చిన్న నాటి స్నేహితుడికి సహచర మిత్రులు అండగా నిలిచి రూ.62వేల నగదును అందించారు. సుల్తానాబాద్‌కు చెందిన దూడం శ్రీనివాస్ కూతురు వివాహాన్ని పురస్కరించుకుని, ఆయనకు అండగా నిలువాలని భావించిన మిత్రుడు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ యాభై వేల రూపాయలను అందించాడు. మిగతా మిత్రులు గజభీంకార్ శ్రీనివాస్, గంగిరెడ్డి రాజశేఖర్, కామని వెంకటరమణ, సర్వర్ పాషా, చిలగాని వెంకటేశం తదితరులు మరో పన్నెండు వేల రూపాయలను జమ చేసి శుక్రవారం దూడం శ్రీనివాస్‌కు అందజేశారు. వివాహానికి అండగా నిలిచిన మిత్ర బృందాన్ని పలువురు అభినందించారు.

విద్యార్థులను అభినందించిన ఎంఈవో



విద్యార్థులను అభినందించిన ఎంఈవో

ఎలిగేడు, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కోడూరి సాహిత్య, ఇజ్జగిరి ప్రణవిలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి అనసూరి నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గంద్ర దేవేందర్‌రావు సన్మానించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి భావితరాలకు మార్గదర్శకులు కావాలన్నారు. సీఆర్‌పీ లక్ష్మీనారాయణ, శ్వేత, రమేష్, ఎంఐఎస్ శిరీష, ఆపరేటర్ కళావతి, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్



దేవ శ్రీనివాస్

ఎలిగేడు, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్ట గ్రామంలో శుక్రవారం గ్రామస్థులు, యువకులు గౌతమబుద్ధుని ఉత్సవ కమిటీ చైర్మన్‌గా మాజీ సర్పంచ్ దేవ శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు వారు కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా బాలసాని పరశురాంగౌడ్, గౌరవ సలహాదారులుగా మాజీ సర్పంచ్ పడాల పరశురాం గౌడ్, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేష్, ఇరువురాల తిరుపతి, ఉపాధ్యక్షులుగా అట్టెపల్లి కనుకయ్య, పొల్సాని పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కొక్కిరాల దామోదర్‌రావు, మారం కొమురయ్య, కార్యవర్గ సభ్యులుగా దేవరాం, భూసారపు అనిల్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

మంథని, మే 2 (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మాన్ని ప్రబోధించిన జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని శ్రీలేశ్వర-సిద్ధేశ్వరాలయంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారి విగ్రహానికి వేదపండితులు అభిషేకాలు, అర్చనలు చేశారు. ఐదు రోజులుగా స్వామి వారికి నిత్య రుద్రాభిషేకం భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి చిత్రపటంతో పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.

నిందితులకు పోలీస్ మార్క్ కౌన్సెలింగ్

కోల్‌సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో రౌడీయిజం చెక్ పెట్టేందుకు పోలీస్ మార్క్ కౌన్సెలింగ్ మొదలైంది. శుక్రవారం గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లో రౌడీషీటర్ చీమల తిరుపతిని పట్టపగలు జనం చూస్తుండగా అదే కాలనీకి చెందిన మరో ఇద్దరు పాత నేరస్థులు దాడి చేసి హత్యాయత్నంకు పాల్పడ్డారు. అందరూ నేర చరిత్ర కలిగిన వారైనా ఈ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. శుక్రవారం సాయంత్రం నిందితులను అదుపులోకి తీసుకుని విచారణకు ప్రశాంత్‌నగర్‌కు తీసుకెళ్లినట్టు సమాచారం. అక్కడే జనం చూస్తుండగా పోలీస్ మార్క్ కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో నేరస్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయడం వల్ల ఈ పరిస్థితులు వచ్చాయని, భవిష్యత్‌లోనూ నేరస్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్ వర్తింపచేయవద్దని, ఇదే తరహా కౌన్సెలింగ్‌లు ఇవ్వాలని స్థానికులు కోరారు.

డీఎంహెచ్‌వోపై దౌర్జన్యం చేసిన వారిని శిక్షించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాపయ్య

పెద్దపల్లిటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విధులకు ఆటంకం కలిగించి భయభ్రాంతులకు గురిచేసిన గోదావరిఖని మమత హాస్పిటల్ యజమాన్యం, వైద్యులు, సిబ్బందిపై కేసులు నమోదు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత నెల 26న డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి విధి నిర్వహణలో భాగంగా గోదావరిఖని మమత హాస్పిటల్ తనిఖీ చేయగా అనుమతి లేకుండా నిర్వహిస్తున్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ ను గుర్తించారని తెలిపారు. చట్ట ప్రకారం ప్రభుత్వ అనుమతి లేకుండా మిషన్ కలిగి ఉండడం నేరమని, చర్యలు తీసుకొంటుండగా వైద్యులు నాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అడ్డుపడ్డారన్నారు. డిఎంహెచ్‌వోను బెదిరించిన డాక్టర్లపై తక్షణమే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు మహంకాళి స్వామి, అతని అనుచరులు, హాస్పిటల్ యజమాన్యం, రిసెప్షనిస్ట్ ఆనంద్ ద్వారా అధికారినిపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ, అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్ లక్ష్మయ్య, కట్కూరి సందీప్, కొంకటి లింగమూర్తి, పెద్దపల్లి, సుల్తానాబాద్ మండలాల కన్వీనర్లు బుసెల్లి నారాయణ, లక్ష్మణ్, పాల్గొన్నారు.

అవయవ దానానికి అంగీకారం

కోల్‌సిటీటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన సింగరేణి కాంట్రాక్టర్ కట్ల లక్ష్మీనారాయణ- ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కట్ల స్వరూప దంపతులు అవయవదానానికి అంగీకారం తెలిపారు. కూతురు శ్రీమేధ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం వారి మరణాంతరం నేత్రాలు, అవయవాలను దానం చేస్తామని అంగీకార పత్రాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాసులకు అందజేశారు. దంపతులు తీసుకున్న నిర్ణయాన్ని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో సదాశయ ప్రతినిధులు తాడబోయిన రాములు, సరోజన, మగువ లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షురాలు శశికళ, నాగుల శంకర్, సుందర్, దబ్బెట శంకర్ పాల్గొన్నారు.

కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

కమాన్‌పూర్, మే 2(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టడానికి కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీఎస్పీ మంథని నియోజకవర్గం ఇన్‌చార్జి జనగామ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నేళ్ళుగా బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి డిమాండ్‌కు తలొగ్గి కేంద్రం దేశవ్యాప్త కులగణన చేపడుతుందని, బీఎస్పీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు, పార్లమెంట్‌ను స్తంభింప చేయడం వంటి కార్యక్రమాల ఫలితమే కేంద్రం దేశవ్యాప్తంగా కులగణనకు నిర్ణయం తీసుకొందన్నారు. ఈ కులగణన నిష్పక్షపాతంగా చేపట్టాలని కోరారు.

పాస్టర్ మృతి తీరని లోటు

మంథని, మే 2 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లూరి ప్రభాకర్ అకాల మరణం క్రైస్తవులందరికి తీరని లోటని ఐఎంఏ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ శుక్రవారం తెలిపారు. 15 ఏళ్ళుగా సీయోను ప్రార్థన మందిరంలో క్రైస్తవ దిన చర్యలో కొనసాగుతున్న ప్రభాకర్ గురువారం అనారోగ్యంతో మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. భువనగిరిలో జరిగిన అంతియాత్రలో పాల్గొన్నట్లు తెలిపారు.

ఓటమి నుంచి గెలుపునకు బాటలు వేసుకోవాలి



అలరించిన విద్యార్థుల నృత్యాలు

సుల్తానాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓటమితో కృంగిపోకుండా కారణాలు తెలుసుకుంటూ గెలుపునకు బాటలు వేసుకోవాలని ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ అన్నారు. పట్టణంలోని శ్రీవాణి విద్యా సంస్థల డిగ్రీ, పీజీ కళాశాలల వార్షికోత్సవం నర్సయ్యపల్లిలోని విజయ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. డీఎఫ్‌ఓ మాట్లాడుతు ఓటమి కారణాలను విశ్లేషించుకుని అనంతరం లక్ష్యాలను సాధించారన్నారు. విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక్, డైరెక్టర్ సుష్మా మాట్లాడుతు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యతను బోధిస్తూ కార్పోరేట్ స్థాయి ఫలితాలను సాధిస్తున్నామన్నారు. అన్ని రంగాలలో రాణించే విధంగా వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

ఇవ్వడం ఆరంభించింది. గత నెల నుంచి రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తున్న దృష్ట్యా ప్రభుత్వం సన్న రకం ధాన్యం సాగును ప్రోత్స హించేందుకు క్వింటాలు ధాన్యానికి 500 బోనస్ ప్రకటించింది. ఈ సీజన్‌లో చాలా మంది రైతులు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని 15 రోజుల నుంచి కుప్పలు పోశారు. రైస్‌మిల్లులు కేటాయించలేదనే కారణంగా సన్న రకం ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయడం లేదని నిర్వాహకులు చెబుతున్నట్లు రైతులు తెలిపారు. ఎక్కువ రోజులు కేంద్రాల్లోనే ధాన్యాన్ని ఉండడంతో దూకం తగ్గి నష్టపోవాల్సి వస్తుందని రైతులు తెలిపారు. సన్నరకం ధాన్యాన్ని కూడా వేగంగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్‌రెడ్డి 'ఆంధ్ర జ్యోతి'తో మాట్లాడుతూ బ్యాంకు గ్యారంటీలు సమర్పించిన 118 రైసు మిల్లులకు ధాన్యం కేంద్రాలను కేటాయించాం. సన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, ప్రతి గింజ కొను గోలు చేస్తామని, రైతులు ఆందోళన చెంద వద్దని, దళారులకు కాకుండా కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

బస్టాండ్‌లో మత ప్రచారంపై వివాదం

కోల్‌సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్‌లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సమీప గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రయాణికులకు మత ప్రచారం చేయడం వివాదస్పదమైంది. ఆ వ్యక్తిని కొందరు వ్యక్తులు, ప్రయాణికులు అడ్డుకుని అవమానించారని పాస్టర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదైంది. కాగా మత ప్రచారం చేస్తూ బలవంతంగా మత మార్పిడికి ప్రయత్నించారని మరికొందరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘటనపై ఎవరూ కూడా వీడియోలను వైరల్ చేయవద్దని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కోరారు. బస్టాండ్ ఘటనలో పాల్గొన్న వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని, ఇలాంటి ఘటనలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మతస్వేచ్ఛకు భంగం కలిగిస్తూ గోదావరిఖని బస్టాండ్‌లో ఓ క్రైస్తవుడిపై జరిగిన అవమానకర ఘటనపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఇంద్రసేనారెడ్డికి ఫిర్యాదుచేశారు. ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ ఎం.మహిపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పాస్టర్ పి.డిలైట్ మాట్లాడుతూ మతపరమైన కరపత్రాలు పంచుతున్నాడనే కారణంతో కొందరు అతనిని బలవంతంగా బస్టాండ్‌లో మోకాళ్ళ మీద కూర్చొబెట్టి, ముక్కు భూమికి రాయించి దూషిస్తూ అవమానకరంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డ్‌పై చర్యలు తీసుకోవాలి

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లికి చెందిన దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి ఆర్‌టీసీ బస్టాండ్‌లో మత ప్రచారం చేస్తుండగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్న అమరేందర్ అడ్డుకొని కరపత్రాలను పంచకుండా చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ డిపో మేనేజర్ నాగభూషణంకు యునైటెడ్ చర్చి పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిమోతి పాల్, ప్రధాన కార్యదర్శి నిరీక్షణ్‌రావు వినతి పత్రం అందజేశారు. గురువారం బస్టాండ్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తుండగా అమరేందర్ అడ్డుకుని కరపత్రాలను ఎందుకు పంచుతున్నావంటూ, ఆర్‌ఎస్‌ఎస్ వారిని రప్పించి దుర్గా ప్రసాద్‌తో గుంజీలు తీయించారని, క్రైస్తవ మనోభావాలను దెబ్బతీసిన అమరేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. నవీన్, శ్యాంసన్, అబ్రహం, ప్రభాకర్, జోసఫ్, జాన్సన్, డేనియల్ ఉన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన కార్మిక సంఘాలు



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పెద్దపల్లిటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్‌కు ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మె నోటీస్ అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను అమలు చేస్తుందన్నారు. కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకొన్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను ముందుకు తీసుకువచ్చిందన్నారు. 20న జరిగే సమ్మెలో కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో జిల్లాలోని వివిధ పరిశ్రమలలో, సంస్థలలో, కంపెనీలలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులందరూ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు భూమల్లచందర్, కడారి సునీల్, ఎరవెల్లి ముత్యం రావు, వైకుంఠం, లక్ష్మణ్, జె, సమ్మిరెడ్డి, మేకల సంపత్ పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్ లారీలతో దెబ్బతిన్న రోడ్డు

పెద్దపల్లి రూరల్ , మే 2 (ఆంధ్రజ్యోతి) : రాఘవపూర్ గోదాంల గుండా దేవునిపల్లి వెళ్లే దారిపై నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్‌తో లారీల్లో మట్టి రవాణా చేస్తుండడంతో రహదారి దెబ్బతిందని శుక్రవారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న రోడ్డును మరమ్మతు చేయించాలని, ఓవర్ లోడ్ తో లారీలు వెళ్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు.

విద్యార్థులను అభినందించిన జీఎం



రామగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సెంటినరీకాలనీ వాణి పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడంపై ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు సన్మానించారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒర్రె సాహితి 584, సాత్విక్ 581, మాన్విత 578లకు అభినందనలు తెలిపారు. పిఈటి బుద్దుల తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల ప్రచారం



విద్యార్థికి వివరిస్తున్న అధ్యాపకులు

కోల్‌సిటీటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు వినూత్న ప్రచారం చేపట్టారు. కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ శుక్రవారం గోదావరిఖని చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యపై ఇంటింటికి వెళ్లి వివరించారు. ఉచిత పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్, డిజిటల్ తరగతులు, స్కాలర్‌షిప్స్ నీట్ కోచింగ్ వంటి సదుపాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్, కవిత, అనురాధ, లక్ష్మి పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ప్రారంభం

జూలపల్లి, మే 2.(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శుక్రవారం నాబార్డు సహకారంతో స్పందనా సేవా సొసైటి ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ ఫ్యాషన్‌డిజైన్ శిక్షణను అధికారులు ప్రారంభించారు. మూడు మిషన్లను మండల సమైక్యకు అందజేసారు. సిఈఓ శోభరాణి, పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణ పారంభం

ధర్మారం, మే 2 (ఆంధ్రజ్యోతి) వేసవిలో విద్యార్థులకు వాలీబాల్ క్రీడలో శిక్షణ ఇచ్చేందుకు మండలంలోని నందిమేడారంలో వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. జిల్లా యువజన అండ్ క్రీడల శాఖ జిల్లా సౌజన్యంతో నిర్వహిస్తున్న శిబిరంలో ఆసక్తి కలిగిన విద్యార్థులు ఉచిత శిక్షణ తీసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

సుల్తానాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ అన్నారు.

నేత్రదానం

పాలకుర్తి,మే 2(ఆంధ్రజ్యోతి): జీడినగర్ ప్రాంతానికి చెందిన జంపాల యాదగిరి అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యుల సమక్ష్యంలో శుక్రవారం నేత్రాలను సేకరించారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నేత్రాలను సేకరించారు.

కులగణనతో సామాజిక ఐక్యత బలపడుతుంది



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, మే 2(ఆంధ్రజ్యోతి): కులగణనతో దేశంలో సామాజిక ఐక్యత బలపడుతుందని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంతుగౌడ్ అన్నారు. కుల గణనను స్వాగతిస్తూ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని మోదీ సర్కార్ కీలక నిర్ణయాన్ని తీసుకున్నదని, రాజకీయ ప్రయోజనాల కోసం సామాజిక అభివృద్ధికే పెద్దపీట వేస్తారన్నారు. కుల గణనకు కాంగ్రెస్, వామపక్షాలు వ్యతిరేకమని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వారి స్వార్థ రాజకీయ కారణాలతో కులాల లెక్కలు తీశారని, ఇలాంటి వాటితో చాలా సందేహాలు తలెత్తుతున్నాయన్నారు. ఏ వర్గాన్ని నొప్పించకుండా ప్రధాని 10శాతం ఈడబ్ల్యుఎస్ కోటాను తీసుకవచ్చి న్యాయం చేశారని, తెలంగాణ, కర్ణాటకల్లో నిర్వహించిన కులగణన అస్తవ్యస్తంగా ఉందని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జనాభా లెక్కల్లో కులగణన చేర్చలేదన్నారు. కోమళ్ల మహేష్, జక్కుల నరహరి, మచ్చ విశ్వాస్, కోడూరి రమేష్, గుండబోయిన భూమయ్య, సతీష్ కుమార్, పద్మ, అపర్ణ, పాల్గొన్నారు.

బలహీనవర్గాలకు అండగా రాహుల్‌గాంధీ

పెద్దపల్లిటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల బలం రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ అనుబంధ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ అన్నారు. ప్రెస్‌క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర చేపట్టిన రాహుల్‌గాంధీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఉన్నప్పుడే బలహీనవర్గాలు బాగుపడతాయని ఆలోచన చేశారన్నారు. తెలంగాణలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కుల గణన చేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా కులగణన చేసినప్పుడే బలహీనవర్గాలు బాగుపడతాయన్నారు. కేంద్రం జనగణన తోపాటు కులగణన నిర్ణయం తీసుకోవడంలో రాహుల్‌గాంధీ ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కొమ్ము శ్రీనివాస్, భూతగడ్డ సంపత్, బొడ్డుపల్లి తిరుపతి, ఊరేటి మహేష్, సిరి శ్రీనివాస్ దరువుల రవి, పాల్గొన్నారు.

బీజేపీ బంద్ సంపూర్ణం

రామగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళిగా మండల బీజేపీ అధ్యక్షుడు కొండ్రు లక్ష్మణ్ శుక్రవారం ఇచ్చిన బంద్ మండలంలోని సెంటినరీకాలనీలో సంపూర్ణం అయ్యింది. సెంటినరీకాలనీలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. పలు గ్రామాల్లో బంద్ ప్రభావం కనిపించింది.

లారీకి తగిలి తెగిన విద్యుత్ వైర్లు

పాలకుర్తి,మే 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి ఎన్టీపీసీకి వెళ్తున్న లారీ ధర్మారం అడ్డరోడ్డు నుంచి బసంత్‌నగర్ రామాలయం మీదుగా శుక్రవారం వెళ్తుండగా విద్యుత్ వైర్లు తగిలి కిందపడ్డాయి. కన్నాల టోల్‌గేట్ రుసుంను తప్పించుకునేందుకు ఈ దారి గుండా వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. లారీ విద్యుత్ వైర్లకు తగలడంతో వైర్లు తెగి కొందిసేపు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

ఆర్‌జీ-1లో తగ్గిన బొగ్గు ఉత్పత్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, మే 2(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1లో ఏప్రిల్‌లో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని, 4.64లక్షల టన్నులకు గాను 2.64లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 50శాతం సాధించిందని ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్‌లో అత్యధికంగా 4లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని రవాణా చేశామని, జీడీకే ఓసీపీ-5 3లక్షల టన్నులకు 1.47లక్షల బొగ్గు ఉత్పత్తి, జీడీకే 1,3 ఇంక్లైన్ 16,200టన్నులకు 10,956టన్నులు, జీడీకే 2, 2ఏ ఇంక్లైన్ 20వేల టన్నులకు గాను 10,950 టన్నులు, జీడీకే 11ఇంక్లైన్ 70,200టన్నులకు 37,469టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిందని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి సంస్థ పెద్దపీట వేస్తుందని, సింగరేణి ఏరియా ఆసుపత్రిలో రూ.20 కోట్లతో క్యాత్ ల్యాబ్ నిర్మిస్తున్నామని, రెండు నెలల్లో పనులు పూర్తయి అందుబాటులోకి వస్తుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో మరో నాలుగు కోర్సులు ప్రవేశపెట్టాలని లేఖ రాశామని, హైదరాబాద్‌లోని గ్లోబల్ ట్రైనింగ్ సెంటర్ వారు జాబ్ గ్యారంటీ కోర్సులను ప్రవేశపెట్టి ఉద్యోగావకాశాలను కల్పిస్తుందన్నారు. సెక్టార్-1, 2 ఏరియాల్లో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి రూ.5కోట్లు కేటాయించామని, ఈ పనులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రారంభించారని చెప్పారు. జీడీకే 11ఇంక్లైన్‌లో మరో కంటిన్యూయస్ మైనర్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని, నీటి సమస్య లేకుండా గ్రావిటీ ఇన్ ఫిల్టర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఓసీపీ-5లో కొనుగోలు చేసిన రెండు షావల్స్ గ్రేడర్లు, సింప్లర్లను త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చి బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేయనున్నట్టు చెప్పారు. జీడీకే1, 3, 2ఇంక్లైన్‌కు ఇసుక కొరత ఉండేదని, జనగామ నుంచి ఇసుకను తీసుకుంటున్నట్టు, దీంతో ఈ రెండు బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తిశాతం పెరుగుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజనీరింగ్ బీవీ రావు, అధికారులు ఆంజనేయులు, కిరణ్‌బాబు, వర ప్రసాద్, జితేందర్‌సింగ్, భీమ, రవీందర్‌రెడ్డి, హనుమంతరావు పాల్గొన్నారు.